నిబంధనలు సరే..ఆచరణేది?

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వాహనచోదకులు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రయాణికులు



ద్విచక్రవాహనంపై పరిమితికి మించి ప్రయాణిస్తున్న యువకులు



ఆటోలో ప్రమాదభరితంగా ప్రయాణికుల తరలింపు

బాపట్లటౌన్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను చోధకులు ఉరుకులు పురుగులు పెట్టిస్తున్నారు. జనాలను హడలెత్తిస్తున్నారు. బాపట్ల పట్టణంలో మైనర్లు సైతం వాహనాలను యథేచ్ఛగా నడుపుతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీరిని నియంత్రించడంలో రావాణా, పోలీస్ శాఖలు విఫలమయ్యాయనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

అవగాహన సరే.. ఆచరణ ఎక్కడ?

ఏడాదిలో ఒకసారి నిర్వహించే రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందిన తర్వాతనే వాహనాలు నడపాలి, పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లు నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి... అధిక లోడుతో వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం అంటూ సభలు, రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ప్రసంగాలు ఇచ్చిన అధికారులు ఆ తర్వాత వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. డ్రైవింగ్ పూర్తిగా రాని వారికి కూడా అధికారులు లైసెన్స్‌లు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు అక్కడకు చేరుకొని హడావుడి చేయడం తప్పా తగు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మైనర్ బాలురు కూడా వాయువేగంగా బైక్‌లపై దూసుకెళ్తున్నారు. ఒక్కో ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ముగ్గురు నుంచి ఐదుగురు వరకు వెళ్తూ.. రోడ్లపై తిరుగుతూ కనిపిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన మోటారు వాహనాల తనిఖీ అధికారులు, పోలీస్ అధికారులు చూసిచూడనట్లుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు వాళ్ల సామార్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

గజిబిజిగా నంబరు ప్లేట్లు..

ద్విచక్ర వాహలనపై నంబర్ ప్లేట్లు ఎవరికిష్టమొచ్చినట్లు వారు వేసుకుంటున్నారు. బండి నంబర్ చూసేవారికి నంబరు అర్థం కావడం లేదు. మరికొంత మంది నంబర్‌పై ఉన్న మోజుతో కొన్ని నంబర్లు పెద్దవిగానూ, మరికొన్ని నంబర్లు చిన్నవిగా వేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు చూసే వారిని తప్పుదోవ పట్టిస్తున్నారు. దీని వల్ల రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు నంబర్‌ను సరిగా గుర్తించని కారణంగా బీమా రాని సందర్భాలూ అనేకం ఉన్నాయి. అన్నింటికన్నా నంబర్ ప్లేట్లపై సినీ హీరోలు, రాజకీయనాయల బొమ్మలు వేసి నంబర్ చిన్నగా రాయిస్తున్నారు. ఈ విషయాలు రావాణా, పోలీస్‌శాఖాధికారులకు తెలియంది కాదు. అయితే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడం వలనే అనర్థాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వాహన చోదకులపై చర్యలు తీసుకుంటూనే ఉన్నాం. గత నెల రోజుల వ్యవధిలో సుమారు 500 వాహనాలకు పైగా అపరాధ రుసుం విధించడం జరిగింది. 100కు పైగా వాహనాలను సీజ్ చేశాం. త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తాం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె.పరందామరెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఉప సభాపతి కోన రఘుపతి. – సాక్షి, గుంటూరు

క్లుప్తంగా

మొరాయించిన లారీ.. నిలిచిన రాకపోకలు



కొల్లూరు: ట్రాపిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతంలో లారీ మరమ్మతులకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మంగళవారం బొగ్గు లోడుతో కొల్లూరు వైపు నుంచి కరకట్ట వైపు వెళ్తుండగా ఆకస్మాత్తుగా లారీ మొరాయించింది. పశ్చిమ బ్యాంక్ కెనాల్ వంతెన వద్ద నిలిచిపోయింది. లారీ ముందుకు కదలడానికి వీలులేకపోవడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వంతెనకు అడ్డంగా నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలు కొల్లూరు చేరుకునేందుకు అవకాశం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇరువైపులా వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. స్థానికులు స్పందించి కరకట్ట మీదుగా ఈపూరు, దోనేపూడి వైపు వాహనాలను మళ్లించారు. కొల్లూరు చేరుకోవాల్సిన వాహనాలు 10 కిలోమీటర్ల మేర చుట్టు తిరిగి చేరుకోవాల్సి వచ్చింది.

ప్రతిభకు రూ.1.23 లక్షల సాయం



కొల్లూరు : అంధత్వంతో బాధపడుతున్నపటికీ తమలోని ప్రతిభతో ముందడుగు వేస్తున్న వారిని ఆదుకునేందుకు విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఐవిధా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కొల్లూరులోని శ్రీచైతన్య విద్యా విహార్‌లో అంధ యువతీ యువకులు గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు స్వచ్ఛందంగా సమకూర్చిన రూ.1,23,700 నగదును పాఠశాల డైరెక్టర్ పావులూరి వెంకటేశ్వరరావు, ఉషారాణి ఐవిధా సంస్థ నిర్వాహకురాలు సుమకు అందజేశారు.

పూరిళ్లు దగ్ధం

నిజాంపట్నం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు దగ్ధమైన ఘటన కొమరవోలు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కొమరవోలు ఎస్సీ కాలనీలో గుమ్మడి పరిశుద్ధరావు గృహంలో చోటు చేసుకున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడ్డాయి. మంటలు సమీపంలోని అతని కుమారులు రాజేంద్ర ప్రసాద్, భాస్కర రావుకు చెందిన పూరిళ్లకు వ్యాపించాయి. దీంతో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. స్థానికుల సమాచారంతో రేపల్లె అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. రూ.6లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

తొలగిన టీడీపీ ఫ్లెక్సీలు

సాక్షి ఎఫెక్ట్

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి వచ్చినా.. రేపల్లె పట్టణంలోని మార్కెట్ సెంటరులో ఉన్న టీడీపీ ఫ్లెక్సీలను తొలగించకపోవడంపై మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'కోడ్ కూటమికి ఫ్లెక్సిబుల్' శీర్షికన కథనానికి అధికారులు స్పందించారు. మార్కెట్ సెంటరులోని టీడీపీ ఫ్లెక్సీలను హుటాహుటిన తొలగించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులే వేయడంతో పాటు, ఫ్లెక్సీలను తొలగించామని చెప్పారు. పట్టణంలో పునఃపరిశీలన చేసి ఏవైనా రాజకీయ నాయకులతో కూడిన ఫ్లెక్సీలు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు.

అవినీతిని అరికట్టేందుకు ముందుకు రావాలి



బాపట్ల: అవినీతిని అరికట్టేందుకు సహా కార్యకర్తలు ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరించాలని బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పిలుపునిచ్చారు. ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్ర మోహన్ ఆధ్వర్యంలో జిల్లా టీమ్ జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ను మర్యాదపూర్వకంగా కలెక్టరేట్‌లో కలిసి కేలండర్ అందజేశారు. సహ చట్టం హ్యూమన్ రైట్స్, లోకాయుక్త పై అవగాహన కల్పిస్తున్న ఫోరం ఫర్ ఆర్టీఐ గురించి జేసీ వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ ను ఎఫ్ ఆర్టీఐ టీమ్ కలసి కేలండర్ అందజేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మద్దిబోయిన అమృత్ రాజ్, పట్టణ అధ్యక్షుడు కాకి హెబెల్, పట్టణ మహిళా అధ్యక్షులు కొమరోలు అమృత, నాయకులు బడుగు కిషోర్, రాము పాల్గొన్నారు.

న్యాయం చేయండి..రక్షించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు మారీదు ప్రసాద్ దంపతులు

కొల్లూరు: తమపై దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నాయకుడి నుంచి రక్షించి, న్యాయం చేయాలని బాధిత రైతు కుటుంబం అధికారులకు మొరపెట్టుకుంది. బాధిత కుటుంబం వివరాల మేరకు.. మండలంలోని జువ్వలపాలెం శివారు గుంటూరు గూడేనికి చెందిన మారీదు ప్రసాద్ సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను జువ్వలపాలేనికి చెందిన వేములపల్లి రవికిరణ్ ధ్వంసం చేశారు. తన అనుచరులతో తమపై దౌర్జన్యం చేసి గాలు మార్గం ఏర్పాటు చేయడంపై మంగళవారం తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. తమ పక్క పొలానికి చెందిన టీడీపీ నాయకుడు వేములపల్లి రవికిరణ్ పోలీసులు, సుమారు 70 నుంచి 80 మంది వరకు రౌడీలను మొహరించి తమ భూమిని స్వాధీనం చేసుకున్నారని బాధితులు ఆరోపించారు. తన పంట పొలానికి అక్రమంగా మార్గం ఏర్పాటు చేసుకున్నారని తహసీల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొక్లెన్‌తో మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడంతో పాటు, విద్యుత్తు మోటరు, పొలానికి సాగునీరు అందించే పైప్‌లైన్‌లను పగలకొట్టి దౌర్జన్యానికి దిగారని వాపోయారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో సైతం తమకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. బాధిత రైతు కుటుంబానికి మద్దతుగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు అధికారులను కలిశారు. తగిన న్యాయం చేయాలని కోరారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

అమర్తలూరు(వేమూరు): జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని బాపట్ల డివిజనల్ సహాయ వ్యవసాయాధికారి లక్ష్మీ అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి, మూల్పూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచక్షణా రహితంగా నత్రజని ఎరువుల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ కర్బనం తగ్గిపోయి పంటలు పండని పరస్థితి నెలకొంటుందన్నారు. భూసార పరిరక్షణకు పచ్చి రొట్ట పైరు సాగు చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నగరం: మినుములో మారుకా మచ్చల పురుగు నివారణపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈదుపల్లి, పెదమట్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పూత, పిందె దశలో మారుకా మచ్చల పురుగు అపార నష్టం కలిగిస్తుందన్నారు. పైరు పూత దశకు రాక ముందే ఈ పురుగు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పూత దశలో 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఏఈవో నాగశ్రీనివాస రావు, వీఏఏలు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు సుకన్య బృందానికి పేటెంట్ గ్రాంట్



మానం సుకన్య

బాపట్ల: స్థానిక బాపట్ల ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు మానం సుకన్య పరిశోధన బృందానికి ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ పేటెంట్ గ్రాంట్ పొందారని ప్రిన్సిపల్ గోపాల కృష్ణమూర్తి సంతోషం తెలిపారు. 'లిపోసొమల్ ఫార్ములేషన్ యూసింగ్ లిపోయిక్ యాసిడ్ ఫర్ టార్గెటెడ్ డెలివరీ ఆఫ్ యాంటీ ఆక్సిడాంట్స్ ' అనే అంశంలో జర్మన్ పేటెంట్ గ్రాంట్ లభించినందుకు మానం సుకన్యకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ తన పీహెచ్డీ గైడ్ విద్యాధర, ప్రిన్సిపల్ గోపాల కృష్ణమూర్తి విలువైన సలహాలు, సూచనలు, ప్రోత్సాహంతో పరిశోధనలో మెరుగ్గా రాణించగలుగుతున్నాని పేర్కొన్నారు. ఇటీవల వీవీఐపీఎస్, గుడ్లవల్లేరు కాలేజీలో జరిగిన జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో 'ఇంపాక్ట్ ఆఫ్ ఫెనుగ్రీక్ ఆయిల్ ఆన్ సిటాగ్లిప్టిన్ ఫార్మకోకినెటిక్ అండ్ ఫార్మకోడైనమిక్ ప్రొఫైల్ - ఏ కంప్యూటేషనల్ డాకింగ్ స్టడీ టు కో–రిలేట్ బ్లడ్ గ్లూకోస్ లెవెల్' అనే అంశానికి ఓరల్ ప్రెసెంటేషన్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాపట్ల ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా శ్రీరాములు

బాపట్ల: బాపట్ల మండల గ్రామీణాభివృద్ధి, విస్తరణాధికారిగా పల్నాటి శ్రీరాములు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వెస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శిగా ఉన్న శ్రీరాములును ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఎంపీడీఓ బాబురావును మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తామని శ్రీరాములు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి నివాళి



బాపట్ల: వైఎస్సార్ సీపీ బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు తండ్రి, పార్టీ నాయకుడు కాగిత ఆదాం(70) లేని లోటు తీరనిదని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. కాగిత ఆదాం మృతికి ఆయన మంగళవారం నివాళి అర్పించారు. వెంగళ్‌విహార్ గ్రామ పెద్దగా ఉండటంతో పాటు పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, చింతల రాజశేఖర్, వడ్డిముక్కల డేవిడ్, ఇనగలూరి మాల్యాద్రి, నర్రావుల వెంకట్రావు ఉన్నారు.

ప్యాపర్రు పంచాయతీ రికార్డుల తనిఖీ

అమర్తలూరు(వేమూరు): గ్రామ పంచాయతీల్లో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో మారుతీ శేషాంబ అన్నారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామ పంచాయతీ రికార్డులు ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల రికార్డులు తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులందరూ రికార్డులు సక్రమంగా ఉంచాలని సూచించారు. ప్యాపర్రు గ్రామ పంచాయతీ రికార్డులు అన్ని సక్రమంగా ఉన్నాయని తెలిపారు.

డ్రైవర్ల అప్రమత్తతే ప్రమాదాల నివారణ

బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే సురక్షితమైన ప్రయాణం సాధ్యమని మోటారు వాహనాల తనిఖీ అధికారి డి.రంగారావు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 20వ బ్యాచ్ డ్రైవర్ల శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణా సమయంలో డ్రైవింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ కనపరిచిన డ్రైవర్లు భవిష్యత్తులో మంచిస్థాయిలో స్థిరపడతారన్నారు. రక్షణాత్మకమైన డ్రైవింగ్ లో శిక్షణ ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవింగ్ స్కూళ్లోనే సాధ్యమవుతుందన్నారు.

వైభవంగా రథ సప్తమి పూజలు



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మంగళవారం రథ సప్తమి పర్వదిన పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసమూర్తి ఉదయం సూర్యనారాయణ అష్టకం పారాయణ జరిపారు. పంచామృత అభిషేకం చేసి పంచ సూక్తాలను పఠించారు. స్వామివారి చిత్ర పటం వద్ద శాస్త్రోక్తంగా చిక్కుడు కాయలతో రథం తయారు చేసి రంగ వల్లులపై ఉంచారు. కంతమనేని వంశీ కృష్ణ, సూరిబోయిన సుబ్బయ్య, పొట్టి శ్రీనివాస్ దంపతులు వార్షిక పూజకు ప్రధానకర్తలుగా పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అల్లూరు(కర్లపాలెం): అల్లూరు రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రథ సప్తమి విశేష పూజలు జరిగాయి. మంగళవారం స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామపుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు టెంకాయలు కొట్టి హారతులిచ్చారు.

భట్టిప్రోలు (కొల్లూరు): సూర్య నమస్కారాల్లో ఆరోగ్య సూత్రాలు ఇమిడి ఉన్నాయని సూరేపల్లి ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు కూచిబొట్ల శ్రీనివాస శర్మ పేర్కొన్నారు. మంగళవారం రథ సప్తమిని పురస్కరించుకొని పాఠశాలలో టీటీడీ, ఉమ్మడి జిల్లా హిందూ ధర్మ ప్రజాపరిషత్తు శాఖ సంయుక్తంగా సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించాయి. పాఠశాల పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేశారు. ఆరోగ్యానికి ఉపకరించే పలు ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఉపాధ్యాయులు పి.అనిల్‌కుమార్, కె.శ్యామకుమారి, బి.విజయలక్ష్మి, పి.నరసింహారావు, వై.నరసింహమూర్తి, ఎ.హరిబాబు పాల్గొన్నారు.

బాపట్ల: రథ సప్తమి సందర్భంగా వివేక ఫాస్టర్ స్కూలులో విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. హిందూ చైతన్య వేదిక బాపట్ల పట్టణ శాఖ బెజవాడ వెంకటేశ్వర్లు మంత్రోచ్చారణతో ఈ కార్యక్రమం చేపట్టారు. సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు.

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వకర్త డాక్టర్ గణేష్



అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని శృతి నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. సైలెంట్ కిల్లర్‌గా అభివర్ధించే క్యాన్సర్ నాలుగు దశల్లో బయట పడుతుందని తెలిపారు. ఈ వ్యాధి వయస్సుతో సంబంధం లేదని, ఎవరికైనా వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశంలో అత్యధికంగా గుండె జబ్బులతో మృతి చెందుతుండగా, తరువాత స్థానం క్యాన్సర్‌దేనన్నారు. అటువంటి క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన ఉంటే ఆరంభ దశలో గుర్తించవచ్చని తెలిపారు. తద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధి భారిన పడి జయించిన వారి వివరాలను గణేష్ వెల్లడించారు. మానవ జీవన శైలిలో ఆహారపు అలవాట్లతో అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు వ్యాయామం, సమతుల్య ఆహారం తీసుకుంటూ శరీరానికి తగిన శ్రమను కల్పిస్తే గుండె జబ్బులు, క్యాన్సర్, బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం: విద్యార్థులు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం చీఫ్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే వైద్యం చేయడం వల్ల జయించవచ్చునన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. విద్యార్థులు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. తొలుత నగరం పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరావు, ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ, డాక్టర్ ఎస్.దినేష్, అధ్యాపకులు ఎం.శివయ్య, సురేష్ బాబు, సాంబమూర్తి పాల్గొన్నారు.

కర్లపాలెం: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయ ఆరోగ్య విస్తరణాధికారి సీహెచ్ పరమేశ్వరి చెప్పారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తల సమావేశం, ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశంలో పరమేశ్వరి మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల మహిళలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి చెప్పారు. గుట్కాలు, పాన్‌పరాగ్‌లు, పొగాకు వినియోగించే వారిలో ఎక్కువగా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎం.పద్మావతి, సీహెచ్‌వో ఎస్.మీరమ్మ, సూపర్‌వైజర్ ఇసాక్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు పరిశీలించారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ నెల 27న ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ థియేటర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆర్ఐ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

నిజాంపట్నం: విద్యార్థి దశ నుంచి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేందుకు లక్ష్యాలతో కూడిన విద్యా బుద్ధులను అభ్యసించాలని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌లు, రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్‌ల వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, శ్రద్ధతతో విద్యను అభ్యసించి తమ గమ్యాలను చేరుకోవాలన్నారు. సమాజంలో చోటు చేసుకుంటున్న సైబర్ నేరాలు విధానాలు, ఈవ్‌టీజింగ్‌లపై అవగాహన కల్పించారు.

మద్యం విక్రేత అరెస్ట్

వేమూరు: మద్యం బెల్టు షాపు విక్రేతను అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. మండలంలోని చావలి గ్రామానికి చెందిన మద్యం నిర్వాహకుడు జి.రాజ్‌కుమార్ అనే వ్యక్తి వద్ద 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన మంగళవారం తెలిపారు. కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

కొల్లూరు : అరకొరగా హాజరైన ప్రజా ప్రతినిధులు.. అధికారుల గైర్హాజరు నడుమ కొల్లూరు మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ తమకు ప్రొటోకాల్ వర్తించడం లేదని, ఈ విషయంపై తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓను డిమాండ్ చేశారు. అనంతరం కొల్లూరు లాక్ సెంటర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరసింహారావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రవాస భారతీయురాలు గడ్డిపాటి కల్యాణి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.4లక్షలతో ఏర్పాటు చేసిన గార్డెన్, సరస్వతీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడ్డిపాటి రామమోహనరావు, కస్తూరిదేవి దంపతుల జ్ఞాపకార్థం ఈ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందించడం జరుగుతుందన్నారు. ఎన్నారై గడ్డిపాటి నీలిమ, రాపర్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అలసత్వం వద్దు



బాపట్ల: కీటక జనిత వ్యాధుల నియంత్రణలో ఆలసత్వం వహించవద్దని జిల్లా మలేరియా అధికారి గోపినాథ్ పేర్కొన్నారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్ల సబ్ యూనిట్ అధికారుల శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మలేరియా వ్యాధి నిర్ధారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ల్యాబ్ టెక్నీషియన్ వివిధ వ్యాధులతో వచ్చే రోగులకు చేపట్టే పరీక్షల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గోపీనాథ్‌ను జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ బయ్యా, ప్రధానకార్యదర్శి సత్యంరాజు కూరపాటి అభినందించారు.

కోళ్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

రేపల్లె రూరల్: కోళ్ల పెంపక పరిశ్రమ రైతులు తమ కోళ్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశు సంవర్ధక శాఖ రేపల్లె సహాయ సంచాలకుడు నాంచారయ్య సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వైరస్‌తో ఉమ్మడి గోదావరి జిల్లాలో నాటు, బ్రాయిలర్, లేయర్ కోళ్లు పెద్ద ఎత్తున మృతి చెందాయని చెప్పారు. వైరస్ నిర్ధారణకు వాటి అవశేషాలను పుణేలోని వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పంపడం జరిగిందన్నారు. పట్టణ పరిసరాల్లోని కోళ్ల పెంపకం రైతులు తమ కోళ్ల పరిశ్రమలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. దీనిలో భాగంగా షెడ్లలో బ్లీచింగ్ పౌడరు ఒక రోజు చల్లించాలని, మరో రోజు ఫినాయిల్‌తో శుభ్రపరచాలని చెప్పారు. చనిపోయిన కోళ్లను కాల్వలలో, రోడ్డు మార్జిన్‌లలో పడవేయకూడదని చెప్పారు. మూడు అడుగుల గొయ్యితీసి పాతిపెట్టాలని సూచించారు. ఈ వైరస్ మనుషులకు, పశువులకు సోకినట్లు నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు.